చెల్లింపులు నిల్

- చెరకు రైతుకు కెసిపి షుగర్ ఫ్యాక్టరీ రిక్తహస్తం
- 45 రోజుల నుండి పూర్తిగా నిలిపివేత
- కెసిపి చెబుతున్న బకాయి రూ. 40 కోట్లు
- కూలీలు, కిరాయిల చెల్లింపులకు అప్పులే
- ఫ్యాక్టరీలో రూ. 350 కోట్లు విలువైన నిల్వలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కెసిపి షుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని చెరకు రైతులకు చెల్లింపులు సకాలంలో చేయడం లేదు. రైతులకు సంస్థ పెద్ద మొత్తంలో బకాయి పడింది. సంక్రాంతి పండుగ తరువాత పాక్షికంగా చెల్లింపులు జరిపిన సంస్థ, 45 రోజులుగా పూర్తిగా నిలిపివేసింది. దీంతో పంట పెట్టుబడులకు అప్పులు తీరకుండానే, ఇప్పుడు రవాణాకు, కూలి చెల్లింపులకు మరోసారి అప్పులు చేయాల్సి రావడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

కృష్ణాజిల్లాలోని, ఉయ్యూరు, చల్లపల్లి ప్రాంతాల్లో కెసిపి సంస్థకు రెండు చక్కెర కర్మాగారాలున్నాయి. ఈ రెండు ఫ్యాక్టరీల్లో మార్చి 5 తరువాత చెరకు తోలిన రైతులకు పూర్తిగా చెల్లింపులను నిలిపివేసింది. ప్రతి ఏటా రైతులకు

చెరకు తోలిన 15 రోజుల్లోపే చెల్లింపులు జరిగేవి. ఈ ఏడాది మాత్రం సంక్రాంతి పండుగ ముందు చెరకు తోలిన రైతులకు ఫ్యాక్టరీ యాజమాన్యం చెల్లింపులను సకాలంలో చెల్లించింది. ఆ తరువాత తోలిన చెరకు పంటకు మాత్రం అసంపూర్తిగా అపేసింది. మార్చి 5 నుండి పూర్తిగా నిలిపివేసింది. ఈ ఏడాది ఫ్యాక్టరీ చెరకు టన్నుకు ధర రూ. 2,750లుగా ప్రకటించింది. జనవరి 15 నుండి మార్చి 5 వరకు చెరకు తోలిన రైతులకు టన్నుకు కొందరికి రూ.2వేలు, మరికొందరికి రూ.1000 మాత్రమే చెల్లించింది. మార్చి 5 తరువాత ఫ్యాక్టరీకి తోలిన 14, 54, 545. 45 టన్నులకు నగదు చెల్లింపులు చేయలేదు. అంటే ఈ మొత్తానికి కెసిపి యాజమాన్యం రైతులకు రూ.40కోట్ల వరకు చెల్లించాలి. కెసిపి సంస్థ మొదటి సారిగా చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తోందని రైతులు వాపోతున్నారు. చెరకు నరికి, ఫ్యాక్టరీకి తోలేందుకు సగటున రైతుకు టన్నుకు రూ.1200 ఖర్చవుతోంది. ఎకరానికి సగటున 35 టన్నులు దిగుబడి వస్తే కూలీలకు రవాణా ఛార్జీలకే రూ.42వేలు చెల్లించాలి. పేమెంట్లు నిలిచిపోవడంతో రైతులు పంట పెట్టుబడి అప్పులు తీర్చేందుకు అవకాశం లేకుండా పోతోంది. దీనికి తోడు, రవాణా, నరకుడు కూలీ చెల్లింపులకు అదనంగా అప్పులు చేయాల్సి వస్తోంది.

నెలాఖరులోపు చెల్లింపులు

ఈ సీజన్‌లో ఫ్యాక్టరీలో 11 లక్షల బస్తాలు పంచదార నిల్వలున్నాయి. దీని మొత్తం విలువ రూ.350 కోట్లు ఉంటుంది. ఈ పంచదార రిలీజ్ చేయడానికి అవసరమైన అనుమతులను కేంద్రం ఇవ్వలేదు. సంస్థ లాభాల్లో ఉన్నా పంచదార నిల్వలపై బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. దీంతో రైతులకు చెల్లింపుల్లో జాప్యం జరుగుతోంది. ఈ నెలాఖరుకు ఎలాగైనా రైతులకు పేమెంట్లు పూర్తిస్థాయిలో చెల్లించేందుకు ప్రయత్నిస్తున్నాం.

- జి.వెంకటేశ్వరరావు,
కెసిపి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్

14 రోజులు దాటితే రైతులకు వడ్డీ చెల్లించాలి

చెరకు ఫ్యాక్టరీకి తోలిన 14 రోజుల్లోపు ఫ్యాక్టరీలు నగదు చెల్లించాలి. లేకుంటే చట్ట ప్రకారం వడ్డీ చెల్లించాలి. ఎరువులు, పురుగుమందులు, దుక్కి, విత్తనం ఖర్చులు పెరిగి చెరకు సాగు రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ఫ్యాక్టరీ ప్రకటించిన ధర అయినా సకాలంలో చెల్లించకపోవడం సరైనది కాదు. రైతు బంధు పథకంలో గోడౌన్లలో రైతు దాచుకున్న వ్యవసాయ ఉత్పత్తులకు 90 శాతం రుణం ఇవ్వాల్సి ఉంది. ఈ పథకం ద్వారా పంచదార నిల్వలపై రుణం ఇచ్చి రైతులకు సకాలంలో పేమెంట్లు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేకుంటే కోట్లాది రూపాయలు నిల్వ ఉన్న షుగర్ సెస్ నుంచి అయినా రైతులకు ప్రభుత్వం చెల్లింపులు జరిపాలి.

- ఎం.హరిబాబు
చెరకు రైతు సంఘం రాష్ట్ర నాయకులు

వడ్డీలు పెరుగుతున్నాయి

1.80 సెంట్లు సాగు చేశా. 88 టన్నులు ఫ్యాక్టరీకి తోలాం. రూ.2వేలు చొప్పున 48 టన్నులకు, రూ.1000 చొప్పున 40 టన్నులకు టన్నుకు వెయ్యి మాత్రమే చెల్లించారు. మొత్తం రూ. 2,42,000లు రావాల్సి ఉండగా, 1,36,000 మాత్రమే సంస్థ చెల్లించింది. వీటిలో చెరకు నరుకడు, తోలుడుకు రూ.1,05,600 ఖర్చయింది. బ్యాంకులో పంట రుణం రూ.లక్ష తీసుకున్నా. ఖర్చులు పోను మిగిలిన రూ. 31 వేలు బ్యాంకులో జమ చేశా. ఇంకా 1.6 లక్షలు రావాల్సి ఉంది. రూ.69 వేలు అప్పు చెల్లించాలి. ఈ మొత్తం సాగులో రెక్కల కష్టం తప్ప నాకు మిగిలేదేం లేదు. నగదు చెల్లింపులు సకాలంలో జరగకపోవడంతో బ్యాంకుల్లో వడ్డీలు పెరుగుతున్నాయి.

రాజులపాటి రామాంజనేయ ప్రసాద్
హనుమంతపురం, పమిడిముక్కల మండలం

నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదు

మట్కా, గంజాయి నిర్వాహకులు అరెస్ట్

రూ.3.19 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి-నార్పల (అనంతపురం)

అనంతపురం జిల్లా నార్పల మండల పరిధిలోని చామలూరు క్రాస్ వద్ద గంజాయి విక్రేతలు, మట్కా నిర్వాహకులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.3.19 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. చామలూరు క్రాస్ వద్ద గురువారం ఉదయం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో మూడు ద్విచక్ర వాహనాల్లో నాయనపల్లి క్రాస్ వైపు నుంచి నార్పల వైపు ఏడుగురు వ్యక్తులు తెల్లని సంచులతో వెళ్లడాన్ని గుర్తించారు. పోలీసులను చూడగానే వాహనాలు ఆపకుండా పారిపోయారు. దీంతో పోలీసులు వారిని వెంబడించి చామలూరు క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న సంచులను పరిశీలించగా.. గంజాయి, మట్కా చీటీలు లభ్యమయ్యాయి. వారి నుంచి 510 గ్రాముల గంజాయి, రూ.3,19,650 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, మట్కా చీటీలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వారిలో చిన్నికృష్ణ, బోయ పుల్లయ్య, తలారి వెంకట రాముడు, తలారి ఓబులేసు, పోచీమ గోపాల్‌రెడ్డి, సంపంగి శ్రీనివాసులు, మురళి ఉన్నారు. వీరిని గురువారం సాయంత్రం కోర్టుకు హాజరుపరుస్తామని డీఎస్పీ తెలిపారు.

'స్టాంపుల్లో మహాత్ముడు' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-గుడివాడ (కృష్ణా)

బాపూజీ బోధనలు ఈ నాటికీ ఎంతో ప్రాచుర్యం సంతరించుకున్నాయని డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ అన్నారు. స్థానిక షాగులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో బుధవారం రాత్రి జిల్లా కథా రచయితల సంఘం అధ్యక్షులు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షతన ప్రముఖ రచయిత పుట్టి నాగలక్ష్మి రచించిన 'స్టాంపుల్లో మహాత్ముడు' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ 150వ జయంతోత్సవాలలో వెలువడిన గ్రంథాల్లో ఈ పుస్తకం ప్రత్యేకమైందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ జి.వి పూర్ణచంద్, సీనియర్ జర్నలిస్ట్ కె.బి లక్ష్మి, డాక్టర్ కొడాలి సోమసుందరరావు, డాక్టర్ బండారు శ్యాంకుమార్, జన్ను చిరంజీవిరావు, లంకా కాళిదాసు, కె.రమాదేవి, సాహితీవేత్తలు హెచ్.ఆర్ చంద్రం, మందారం వెంకటేశ్వరరావు, చోడవరపు విజయ్‌కుమార్, కరెడ్ల సుశీల తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల సొమ్ము చోరీ

ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - కాకినాడ సిటీ

దౌర్జన్యం చేసి, బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న ముగ్గురిని తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కాకినాడ డిఎస్పి రవివర్మ వారి వివరాలను మీడియాకు వెల్లడించారు. కాకినాడకు చెందిన గురజాపు కిరణ్ సత్యప్రసాద్, మాధవపట్నానికి చెందిన ఆకుల బాలరాజు, కొత్త కాకినాడకు చెందిన బొడ్డు అనిల్ ఈనెల 15వతేదీ రాత్రి కాకినాడ రేచర్లపేటలోని హిజ్రాల వద్దకు వెళ్లి వారిని కత్తులతో బెదిరించి రూ.1,250 సొమ్ము లాక్కుని వెళ్లి పోయారు. మరుసటి రోజు బొడ్డు అనిల్ సంజయ్‌నగర్‌లో నివాసముంటున్న హిజ్రాలను చాకుతో చంపుతానని బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. దీంతో తాటిపర్తి ఇమ్రాన్ మరికొంత మంది హిజ్రాలు ఈనెల 16న కాకినాడ టూటౌన్ పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. అలాగే నగరంలో మార్వాడీ షాపుల వారిని, మరి కొందర్ని బెదిరించి డబ్బు వసూలు చేస్తున్నారని గుర్తించారు. ఏడాదికి పైగా ఇలాంటి నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వివిధ హత్యకేసుల్లోనూ వీరు నిందితులుగా ఉన్నారని తెలిపారు.

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

అధికారులకు గిరిజన సంక్షేమ శాఖ సంచాలకులు చంద్రుడు ఆదేశాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐటిడిఎ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులకు ఆ శాఖ సంచాలకులు గంధం చంద్రుడు ఆదేశాలు జారీ చేశారు. మలేరియా రాకుండా ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా మెడికల్, హెల్త్ మోనటరింగ్ యూనిట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఏజెన్సీ ఏరియాలలో అపరిశుభ్ర ప్రాంతాలను గుర్తించి విడతల వారీగా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన క్రిమిసంహారాలతో తరచుగా పిచికారీ చేయాలనీ, దోమతెరలను పంపిణీ చేయాలని పేర్కొన్నారు. రక్త పరీక్షలు నిర్వహించి, పాజిటివ్ ఉన్న వారికి ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయించాలని సూచించారు. వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులకు వైద్య శిబిరాలు నిర్వహించి, అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఐటిడిఎలో ఆరోగ్య పర్యవేక్షణ విభాగం ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం పలు ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా నిర్ధారణ కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ నుంచి పలువురు బహిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కడప జిల్లా కాంగ్రెస్ పార్టీకి చెందిన నగర మహిళా కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు నసీమా సుల్తానా, డిసిసి మాజీ కార్యదర్శి అబ్దుల్ రవూఫ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి బి తిరుమలేశ్‌లు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు బహిష్కరించారు. ఈ మేరకు ఆ పార్టీ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ లింగంశెట్టి ఈశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిష్కరణ వెంటనే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు.

'శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు'

ప్రజాశక్తి-యాడికి (అనంతపురం)

అనంతపురం జిల్లా యాడికి మండలంలోని పలు గ్రామాల్లో పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో యాడికి, చందన గ్రామాల్లో పర్యటించారు. పలు ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు కక్షలకు దూరంగా ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫలితాల సమయంలోనూ ఇలానే ఉండాలని అన్ని పార్టీల నాయకులకు సూచించారు.

ప్రజల సమస్యను పరిష్కరించాలి : ఎన్‌జిటి బృందం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం మూలలంక భూముల్లోని డంపింగ్ పనులను, సమీపంలో ఉన్న బిసి కాలనీ నివాసాలను నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బృందం పశ్చిమగోదావరి జిల్లా పోలవరంలో జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం పరిశీలించింది. స్థానిక సుజల అతిథి గృహంలో మట్టి డంపింగ్‌పై ప్రజల అభిప్రాయాలను గ్రీన్ ట్రిబ్యునల్ బృందం అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అధికారులు మాట్లాడుతూ ట్రిబ్యునల్ కోర్టు ఆదేశాల మేరకు పోలవరం మూలలంక భూముల్లో డంపింగ్ సమస్యను పరిశీలించి నివేదికను కోర్టుకు అందజేస్తామన్నారు. పోలవరం గ్రామ ప్రజల సమస్యలను పరిగణలోకి తీసుకున్నామని, సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు

డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న బృందం

సూచించినట్లు బృందం తెలిపింది. వైసిపి మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు ఎస్‌కె.ఫాతిమున్నీసా మాట్లాడుతూ మూలలంక భూముల్లో పోలవరం ప్రాజెక్టు మట్టిని డంపింగ్ చేస్తున్న వాహనాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సూచనల మేరకు మట్టి డంపిం గ్‌లో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నామ న్నారు. మిగిలిన సమస్యలను గుత్తేదారులు, ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అడిషనల్ డైరెక్టర్ ఎం.మధుసూదన్, చెన్నైకి చెందిన శాస్త్రవేత్త పి.పాల్పండి, వైజాగ్‌కు చెందిన ఎన్విరానమెంటల్ ఇంజినీర్ ఎన్‌వి.భాస్కర్‌రావు, కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

మహిళలే మా బలం : మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - పెద్దపంజాణి (తిరుపతి)

రాష్ట్రంలో మహిళల ఓట్లే మా బలం, టిడిపి విజయం తథ్యం అని మంత్రి అమరనాథ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ, అన్నదాత సుఖీభవ, పసుపు- కుంకుమ వంటి అభివృద్ధి కార్యక్రమాలను చంద్రబాబు ప్రభుత్వం దిగ్విజయంగా అమలు చేసిందన్నారు. దీన్ని చూసి ఓర్వకనే ప్రతిపక్షాలు చంద్రబాబు నాయుడిని విమర్శిస్తున్నారని చెప్పారు. తాను 18 సార్లు ఎలక్షన్ కమిషన్ నిర్వహించిన ఎన్నికలు చూశానని, 2019 ఎన్నికలు లోపభూయిష్టంగా ఇసి నిర్వహించిందని విమర్శించారు. అదే విధంగా ఈవీఎంలు పనిచేయకపోవడం, ఓటర్లకు సరైన సౌకర్యాలు కల్పించకపోవడం, ఎన్నికలు నిర్వహిస్తున్న బూతులు వద్ద సరైన భద్రతా బలగాలు ఏర్పాటు చేయడంలో ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైందని అన్నారు. ఈ సమావేశంలో పలమనేరు మార్కెటింగ్ కమిటీ ఉపాధ్యక్షులు జి. నాగరాజు, ఎంపిపి మురళీక ష్ణ, టిడిపి మండల అధ్యక్షుడు శ్రీరాములు పాల్గొన్నారు.

కలెక్టర్ వేధింపులతోనే ఆత్మహత్య

మృతుడి భార్య విజయలక్ష్మి రోదన

ప్రజాశక్తి - కడపఅర్బన్

'మెడబెట్టి గెంటుతాను, నీ గొంతు నులిమి చంపుతానని' కడప జిల్లా కలెక్టరేట్ కార్యాలయం పనిచేస్తున్న బి-సెక్షన్ సూపరింటెండెంట్ రామక్రిష్ణయ్యను కలెక్టర్ హరికిరణ్ అవమానపరచడంతో తన భర్త ఈ నెల 6వ తేదీన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్య విజయలక్ష్మి రోదించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. తన భర్త 34 సంవత్సరాలు చిత్తూరు జిల్లాలో పని చేశారని, ఎంతో మంది కలెక్టరులతో అవార్డులు కూడా తీసుకున్నారని పేర్కొన్నారు. కలెక్టర్ హరికిరణ్ తన భర్తను మానసికంగా హింసపెట్టారని పేర్కొన్నారు. తమకు ఎలాంటి కుటుంబ కలహాలు లేవన్నారు. తన భర్తలాగా భవిష్యత్తులో మరెవరూ కలెక్టర్ వల్ల బలికాకూడనే ఈ విషయాలను పత్రికల ద్వారా తెలియజేస్తున్నానని పేర్కొన్నారు.

పుట్టెడు కష్టాల్లో పసుపు రైతులు

- పెరుగుతున్న నిల్వలు
- మద్దతు ధర పొందలేకపోతున్న రైతులు
- ప్రభుత్వ ప్రోత్సాహం కరువు

ప్రజాశక్తి - దుగ్గిరాల (గుంటూరు జిల్లా)/కాకినాడ

గుంటూరు జిల్లాలో పసుపు నిల్వలు పేరుకుపోతున్నాయి. ధరలు ఆశాజనకంగా లేక లావాదేవీలు మందకొడిగా సాగుతున్నాయి. దుగ్గిరాల పసుపు యార్డులో బుధవారం సగటు ధరలు క్వింటాలు రూ.5550 పలుకుతోంది. పెరిగిన ఖర్చుల దృష్ట్యా కనీసం రూ.8వేలు ఉంటేగానీ గిట్టుబాటు కాని పరిస్థితి. ప్రభుత్వం రూ.10వేలు మద్దతు ధర ప్రకటించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కానీ ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేదు. రైతుకు లాభం లేకపోయినా ప్రత్యామ్నాయ పంటలు వేయలేక ఈ పంటను కొనసాగిస్తున్నారు. పసుపు ధర తగ్గడానికి అధికారులు చెబుతున్న కారణాలతో రైతులు ఏకీభవించడం లేదు. డిమాండ్ సప్లై మధ్య వ్యత్యాసం ఉందని, దేశ అవసరాలకన్నా ఎక్కువ పంట దిగుబడి అవుతుందని, అందువలన ధరలు తగ్గుతున్నాయని అధికారులు తెలిపారు.

దుగ్గిరాల మార్కెటింగ్‌యార్డు పరిధిలో రైతులు, వ్యాపారస్తుల వద్ద 4లక్షల బస్తాలు ప్రభుత్వం వద్ద 70వేల బస్తాలు ఉండగా యార్డుకు వచ్చే సరుకు, ప్రైవేటు వ్యాపారస్తుల వద్దకు వచ్చే సరుకు దాదాపు 7లక్షల బస్తాల వరకు నిల్వ ఉన్నట్లు అంచనా. ఈ సంవత్సరం సాగు విస్తీర్ణం పెరగలేదుగానీ దిగుబడి గణనీయంగా పెరిగింది. రైతులు పండించిన పంటకు ధర వచ్చే వరకు నిల్వ చేసే పరిస్థితి లేదు. ఎగుమతి అవకాశాలు తగ్గడంతో ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరకే తెగనమ్ముకుంటున్నారు. వ్యాపారస్తులు, స్టాకిస్టులకు సంవత్సరానికి 100 క్వింటాళ్ల అవసరమైతే అంతమేరకే కొనుగోలు చేస్తున్నారు. నోట్ల రద్దు ప్రభావంతో స్టాకిస్టులకు బ్యాంకులు రుణాలు ఇవ్వడంలేదు. దీనితో నిల్వ చేసేవారు మార్కెట్ నుండి

గుంటూరు జిల్లా దుగ్గిరాల యార్డులో పేరుకుపోయిన పసుపు నిల్వలు

తప్పుకున్నారు. వ్యాపారస్తులకు బ్యాంకు కావలసిన మేర నగదు పంపిణీ చేయడంలేదు. 2017లో ప్రభుత్వం పసుపు కొమ్ములకు రూ.6500లు, దుంపలు రూ.6వేల మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేసింది. ప్రస్తుతం అమ్మకానికి పెట్టింది. మార్కెట్‌లో ఉన్న ధరకు అమ్మేస్తుంది. దీనివలన మార్కెట్ నాశనమవుతుందం టున్నారు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ వారి వద్ద రెండున్నర లక్షల క్వింటాళ్లు ఉన్నాయి. లక్ష క్వింటాళ్ల ఉంటే చాలు ధరలు తారుమారు చేయగలవు. 2017లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలుచేయకుండా రైతులు పండించిన పంటకు బోనస్ ఇచ్చి ఉంటే ప్రస్తుతం ఇంత దారుణమైన పరిస్థితి ఉండేది కాదంటున్నారు. దుగ్గిరాల, కడప మార్కెట్‌లలో సైతం మార్క్‌ఫెడ్ అధికంగా కొనుగోలు చేసింది.

మార్కెట్‌లో ధరలు స్థిరీకరించడానికి రైతులు మద్దతు ధర ప్రకటించాలని కోరుతుండగా మార్కెట్ ఎనలిస్టులు మాత్రం ఒక సంవత్సరం క్రాప్ హాలిడే ప్రకటించాలని కోరుతున్నారు. ఒక్క సంవత్సరం పంట పండించనంత మాత్రాన రైతుకు వచ్చిన నష్టం ఏమిలేదు. పసుపుకు గిట్టుబాటు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ధాన్యం, మొక్కజొన్న, జొన్న, అపరాలకు గిట్టుబాటు ధర ప్రకటించినప్పుడు పసుపుకు ఎందుకు ప్రకటించరని రైతులు ప్రశ్నిస్తున్నారు. మరోపక్క శాస్త్రీయ పద్ధతులు అవలంభించి వ్యయం తగ్గించుకోవాలని లాభదాయకమైన అధిక దిగుబడినిచ్చే వంగడాలను ఎంచుకోవాలని శాస్త్రవేత్తలు సలహాలు ఇస్తున్నారు.

మద్దతు ధర ప్రకటించాలి

ప్రత్యామ్నాయం లేక వ్యవసాయమే చేస్తున్నాం. లాభం వచ్చినా, నష్టం వచ్చినా తాతల కాలం నుండి వస్తున్న వ్యవసాయాన్ని మానుకోలేం. పసుపు ధరలు పెరుగుతాయి. లాభం వస్తుందన్న ఆశతో సాగు చేస్తున్నాము. పెట్టుబడి పెరిగిపోయింది. ధరలు తగ్గాయి. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి రైతులను ఆదుకోవాలి.

కరేటి శ్రీరామ్‌గోపాల్ యాదవ్,రైతు

కోనసీమలో ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, పి.గన్నవరం, ఏజెన్సీలోని వై.రామవరం మండలాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతుంది. నాలుగేళ్లుగా పసుపునకు గిట్టుబాటు ధర లభించట్లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా పసుపు ధర రూ.5,500 నుంచి రూ.6 వేల వరకూ ఉంది. దీని వల్ల పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని వారు పేర్కొంటున్నారు. క్వింటాల్‌కి రూ.10 వేల నుంచి రూ.11 వేలు పలికితే గిట్టుబాటు అవుతుందని రైతులు అంటున్నారు. కనీస మద్దతు ధర అయినా వస్తుందని చాలా మంది రైతులు పంటను అమ్మకుండానే నిల్వ చేశారు. గిట్టుబాటు ధర కోసం వారు పడిగాపులు కాస్తున్నారు.

పెరుగుతున్న పెట్టుబడులు

పసుపు సాగుకు రోజురోజుకూ పెట్టుబడులు పెరుగుతున్నాయి. ఏడాదిలో ఒక సారి మాత్రమే ఈ పంటను సాగు చేస్తారు. జూన్ నుంచి డిసెంబర్ వరకూ 6 నెలలు పాటు పసుపు సాగవుతుంది. ఎకరా కౌలుకు రూ.45 వేల నుంచి రూ.50 వేలు అవుతుంది. విత్తనాల కొనుగోలుకు (ఎకరాకు 6 నుంచి 7 క్వింటాలు) రూ.30 వేలు, విత్తనాలు వేసేందుకు సుమారు రూ.20 వేలు, పశువుల ఎరువులకు రూ.18 వేలు, దుక్కికి రూ.10 వేలు, ఇతర ఎరువులకు రూ.15 వేలు, పసుపు బాయిలింగ్, ఆరబెట్టేందుకు రూ.25 వేలు ఇలా మొత్తంగా ఎకరాకు రూ.1.70 లక్షల వరకూ పెట్టుబడి పెట్టాల్సి వస్తుంది. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాలు మధ్యలో మాత్రమే దిగుబడి వస్తుంది. క్వింటా పసుపు రూ.5,500 అమ్మినా కనీసం పెట్టుబడి కూడా రావట్లేదు. దీంతో ధర పెంచాలని రైతులు కోరుతున్నారు.

CENTRAL INSTITUTE OF PLASTICS ENGINEERING & TECHNOLOGY (CIPET)
Centre for Skilling and Technical Support (CSTS)
(Department of Chemicals & Petrochemicals) Ministry of Chemicals & Fertilizers Govt. of India
Survey No.: 377, Surampalli Village, Gannavaram Mandal, Vijayawada Krishna Dist. - 521 212
Ph: 0866-2971466 E- Mail:cipetvijayawada@gmail.com , website: www.cipet.gov.in

Expression of Interest for Supply of ABS UF Black, Grade - SX 02 AV BK (ABS - Un Filled Black) & Other Plastic Raw material for CIPET: CSTS Vijayawada

Central Institute of Plastics Engineering & Technology (CIPET) a premier National Institution invites expression of interest for Supply of ABS UF Black, Grade - SX 02 AV BK (ABS - Un Filled Black) & Other Plastic Raw material.

Interested parties/persons may obtain the tender document from Administrative department of the above office on payment of Rs. 590/- (including GST) and submit competitive quote with all the details in the sealed cover on or before **02.05.2019 by 02:30 PM.**

Director & Head reserves right to accept or reject any/ all tenders without assigning any reasons thereof.

Director & Head

LAURUS Labs
Knowledge . Innovation . Excellence

Registered Office: Plot No.21, Jawaharlal Nehru Pharma City, Parawada, Visakhapatnam - 531 021, Andhra Pradesh, India.

Corporate Office: 2nd Floor, Serene Chambers, Road No. 7, Banjara Hills, Hyderabad - 500 034, Telangana, India.

Contact Numbers: Tel: +91 40 3980 4333; Fax: +91 40 3980 4320
E-mail: secretarial@lauruslabs.com; Website: www.laurulabs.com
Corporate Identity Number: L24239AP2005PLC047518

NOTICE

Notice is hereby given, pursuant to Regulation 29 and 47 of SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulations, 2015, that a meeting of the Board of Directors of the Company will be held on Thursday, 2nd May, 2019, inter-alia, to consider and approve audited financial results of the Company for the quarter and financial year ended 31st March, 2019 and to recommend Dividend, if any, on Equity Shares for the year ended 31st March, 2019.

By Order of the Board
For **Laurus Labs Limited**
Sd/- **G.Venkateswar Reddy**
Company Secretary

Place: Hyderabad
Date: April 25, 2019